లవ్ స్టోరీ

ప్రియాంకితం!

డిసెంబర్ 10, 1990
సమయం ఉదయం 8-30
కావొస్తోంది. డిసెంబర్ మాసం కావడం చేత రోడ్లు, పరిసరాలు గమ్మత్తుగా వున్నాయి - ఇంకా ఆరని మంచు బిందువుల తడిలో అపురూపంగా...!

మా ఇంజనీరింగ్ కాలేజీ బస్‌స్టాప్‌లో రద్దీ తక్కువగానే వుంది. మనోహర్ గాడు నిన్న మేం చూసి వచ్చిన సినిమాలోని కామెడీ డైలాగ్స్‌ని వినిపిస్తున్నాడు. తన మిమిక్రీ కళతో... నా మనసు వాడి మాటల మీద లేదు... ఇంకా వివరంగా చెప్పాలంటే నా మనసిప్పుడు నా దగ్గరే లేదు... నిన్ననే మా రూమ్ దగ్గర పారేసుకున్నాను. కానీ ఆ మనసు దొరకవల్సిన వాళ్ళకి దొరికి వుంటుందా అన్నదే ఇప్పుడు నా బుర్రని తొలిచేస్తోన్న ప్రశ్న... అసలు నా మనసును నేను పారేసుకోవడమేంటి? అది ఎవరికో దొరకడమేమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే ఓ పదహారు గంటల నలభై ఐదు నిముషాలు వెనక్కి వెళ్ళాలి మనం...

* * *

డిసెంబర్ 9, 1990
సాయంకాలం గం. 5-45 లు. ఆదివారం ఆటవిడుపు కదా అని సినిమా కెళ్దామని మనోహర్ గాడూ, వద్దురా బాబూ గుడికి వెళ్దామని నేనూ హోరా హోరీగా వాదించుకుని అలిసిపోయి చివరికి సినిమాకే ఓటేశాను.

ట్రిప్‌గా తయారై మేడ మీద ఆరేసిన బట్టలు తీసుకువద్దామని డాబా మీదికెళ్ళిన నా కళ్ళ ముందు కొన్ని మెగా వాట్ల మెరుపు మెరిసినట్టయింది. కొద్ది క్షణాల తర్వాత గానీ ఆ మెరుపేమిటో నాకు బోధపడలేదు..

మా రూమ్‌కి కాస్త దూరంలో వున్న ఉమెన్స్ హాస్టల్ బిల్డింగ్ పైన ఆ సజీవ శిల్పం... శరత్ ఋతువు నాటి పున్నమి చంద్రుడిలా తళుకులీనుతోన్న ఆమె ముఖారవిందానికి క్రొత్త సింగారాన్నిస్తోన్న సింధూరం బొట్టు అప్పుడే సయ్యాటలాడుతోన్న ముంగురులు... పాల మీగడ లాంటి తెల్లటి పరికిణీ, గులాబి రంగు వోణీలో... బాపు బొమ్మకి ప్రాణం వస్తే ఇలాగే వుంటుందేమో అన్పించేంత ఆ మనోజ్ఞ ముగ్ధ వైపే కన్నార్పకుండా చూస్తోన్న నా ఏకాగ్రతని భగ్నం చేసింది మనోహర్ గాడి పిలుపు (అరుపు)... మేడ దిగక తప్పలేదు నాకు. 'తొలి చూపులోనే ప్రేమ' (?) అంటే నాకు అనుభవంలోకి వచ్చిన ఆ క్షణంలోనే నా మనసుని పారేసుకున్నానన్పించింది... ఎంత వెదికినా కన్పించడం లేదు. బహుశా ఆ అమ్మాయి వైపు దూసుకుపోయిందేమో...!

* * *

డిసెంబర్ 10, 1990
"ఎవ్రా ఈ అమ్మాయి... మన కాలేజీలో చూళ్ళేదు" కరుకుగా వినిపించిందో గొంతు... నా ఆలోచనా స్రవంతి తెగిపో యింది... అతని వైపు చూశాను... చక్రవర్తి... మా సీనియర్.

"న్యూ ఎడ్మిషనమకుంటాను గురూ... భజన బృందంలో ఎవరో చెప్పారు చక్రవర్తికి.

అప్పుడు గానీ చూడలేదు ఆ అమ్మాయిని నేను చూడగానే మళ్ళీ నిన్నటి మెరుపు నా కళ్ల ముందు... సందేహం లేదు... నిన్న నా మనసు దోచుకున్న ఆ అమ్మాయే! ఆనందంతో గుండె గొంతులోకి వచ్చిందేమో ఆ అమ్మాయిని పలక రిస్తూ నేను పలికిన 'హల్లో' గొంతు దాటి రాలేదు.

"నీ పేరేంటి?" అడుగుతున్నాడు చక్రవర్తి ఆ అమ్మాయిని... ఆమెని పలకరించాలని నేనూ అటు వైపు కదిలాను.

"ప్రియాంక" లోగొంతుకలో సమాధాన మిచ్చింది ఆ అమ్మాయి.

"ఏం అమ్మడూ ఇంత ఆలస్యంగా జాయిన యయ్యావు?" ఇంకో గొంతడిగింది.

"....."

"ర్యాంకెంత" మరొకడడిగేడు.

"ఆరొందల ముప్పైతొమ్మిది" సందేహిస్తూ చెప్పింది తను.

"అంత ర్యాంక్‌కి ఈ కాలేజీలో సీటెలా వచ్చిందబ్బా" వ్యంగ్యం మరో గొంతులో ప్రతిధ్వనించింది.

"ఫిజికల్లీ హేండీకేప్డ్ కోటాలో..." నవ్వులు వినిపించాయి భజన బృందంలో. నా చెవులు పొరబాటుగా విన్నాయా అన్పించింది నాకు... క్షణకాలం అడుగులు తడబడ్డాయి. ఇంత అద్భుత సౌందర్య రాశికి అంగ వికలత్వమా? నో... నో... నేను అరిచానను కున్నా... కాని గొంతులోనే సమాధైంది ఆ అరుపు.

"ఎక్కడమ్మా నీ లోపం?" బుజ్జగింపుగా అడిగింది మరో గొంతు.

"ఎడమకాలు... 25%".. బాధతో నా మనసు మూల్గింది.

అప్పుడు గొంతు విప్పాడు చక్రవర్తి. "... నీ పేరేంటన్నావ్... ప్రియాంక గదూ?... సినిమాలు చూస్తావా? ఎవడంటే ఇష్టం నీకు...?" అడిగేడు.

జవాబివ్వకుండా తలొంచుకుంది ప్రియాంక.

"అవునూ? నువ్వు 'మయూరి' ఫిల్మ్ చూసావా? చూసుంటావ్‌లే... ఎంతైనా అందులో హీరోయిన్ నీ జాతే కదా?" మళ్ళీ భజన బృందంలో నవ్వులు.

"ఆ సినిమాలోలా నువ్విప్పుడు డ్యాన్స్ చేస్తే ఈ ర్యాగింగ్ ఇక్కడితో ఆపేస్తాం... లేకపోతే..." అంటూ ఏదో చెప్పబోయాడు చక్రవర్తి.

"నేను... నేను నాట్యం చేయలేనండీ.. ప్లీజ్ నన్నొదిలిపెట్టండి" బేలగా వేడుకుంటూంది ప్రియాంక... అప్పటికే ప్రియాంకకి అతి సమీపంగా వచ్చాన్నేను.

"నీకు చేతకానివి చేయించడమంటేనే ర్యాగింగ్... కమాన్... బస్ రావడానికి ఐదు నిముషాలుంది... స్టార్ట్... క్లాప్స్... ఒన్...టు...త్రీ..."

ప్రియాంక కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్న శ్రావణ మేఘాల్లా వున్నాయి.

"యూ... చెబుతుంటే నీ క్కాదూ" అసహనంగా ప్రియాంక దగ్గరికి రాబోయిన చక్రవర్తికి నేను అడ్డుతగిలాను.

"చక్రవర్తి గారు! అసహాయురాలైన ఆ అమ్మాయి నెందుకండీ అలా ఇంతమందిలో అల్లరి పెడతారు... తను డ్యాన్స్ చేయలేనంటోందిగా... ప్లీజ్ ఆమెని వదిలెయ్యండి... ప్లీజ్" సాధ్యమైనంత

రచయిత చిరునామా:
ఎస్.వి.మహేష్‌బాబు
కేరాఫ్ వై.ఎస్.ఎన్. ప్రసాద్,
2-175-6, థర్డ్ రోడ్,
అనంతపూర్ - 515 001

12-4-91 ఆంధ్రజ్యోతి వారపత్రిక



మృదువుగా అన్నాన్నేను.

"ఏరా! అప్పుడే దీనికి లైనేస్తున్నావా? ఇదేమైనా నీ లవరా? తెగబాధపడిపోతున్నవ్...ఆ" అంటూ నా చొక్కా పట్టి వెనక్కి నెట్టి ప్రియాంక చెయ్యి పట్టుకు లాగబోయాడు చక్రవర్తి.

ఉత్తర క్షణంలో బిగించిన నా ఎడమ చేయి పిడికిలి మెరుపులా తాకింది చక్రవర్తి మొహాన్ని... సైమల్టేనియస్‌గా కుడి చేయి ప్రియాంకని కాస్త దూరంగా నెట్టింది. ఊహించని ఈ పరిణామానికి క్షణకాలం అచ్చెరువొంది మళ్ళీ నా మీదికి రాబోయిన చక్రవర్తి పొట్టలో కిక్కిచ్చింది నా కుడి పిడికిలి. భజన బృందం నా మీదికి రాబోయేలోపే మనోహర్ విరుచుకుపడ్డాడు వాళ్ళ మీద. స్టాప్‌లో అంతా చిత్తరువులై చూస్తున్నారు మా వంక...

"రాస్కెల్స్! ర్యాగింగ్ అంటూ మన్ చేసే తి చేష్టలన్నీ చూస్తూ ఊరుకోవడానికి ఇక్కడెవరూ పిరికి పందల్లేరు. ఇకపైన ఆ అమ్మాయి వంక ఎవరైనా కన్నెత్తి చూశారంటే శాల్తీలు లేచిపోతాయి... టేక్ కేర్...!" ఆవేశంతో ఊపుతోన్న నన్ను పక్కకి లాక్కెళ్ళిపోయారు మనోహర్... మా క్లాస్‌మేట్స్.

చిగురుటాకులా వణికిపోతోన్న ప్రియాంకని హాస్టల్‌లో వదిలి రూంకొచ్చామిద్దరం...

"ఏంట్రా నీ ఆవేశం? ఎవరో ముక్కూ మొహమూ తెలియని ఆ అమ్మాయి కోసం చక్రవర్తి గాడి మీద చెయ్ జేసుకున్నావ్... వాడి వెనుక పెద్ద గ్యాంగుంది. వాడు తల్చుకుంటే నిన్నేమైనా చెయ్ గలడు తెల్సా?" కోపంగా అన్నాడు మనోహర్.

"అందుకని...పశువుల్లా వాళ్ళు ప్రవర్తిస్తోంటే అసహాయురాలైన ఆ అమ్మాయిని ర్యాగ్ చేస్తోంటే చూస్తూ వూరుకోవాలా? ఆవాడు డిప్లొమా చదివేప్పుడు ఇలాంటి పరిస్థితుల్లోనే ర్యాగింగ్ భరించలేక నా అత్త కూతురుసూసైడ్ చేసుకున్నప్పుడు నేనెంత క్షోభ పడ్డానో నీకు తెలుసు... అందుకే మరో అమ్మాయికి ఆ పరిస్థితి రాకూడదనే ఇవాళ తిరగబడ్డాను. బికాజ్ ఐ లవ్ ప్రియాంక... ఐ లవ్ హర్... ఐ కాంట్ లీవ్ హర్... ఇంతకన్నా నా ప్రేమకి రీజనింగ్ ఇవ్వలేను..." ఆవేశంగా అంటోన్న నన్ను ఆశ్చర్యంగా చూస్తున్నాడు మనోహర్.

* * *

శుక్ల పక్షమి నాటి చంద్రుడలా దిన దిన ప్రవర్ధమానమవుతోంది మా స్నేహం... ప్రియాంక, నేను, మనోహర్ మా మధ్య అను బంధం మరీ బలపడసాగింది. లాటీన్‌గా సాగి పోతోన్న నా జీవితంలో వసంత మొచ్చినట్లయింది ప్రియాంక రాకతో...

* * *

మార్చి 21 1990

ఆ రోజు ప్రియాంక పుట్టిన రోజు... కాలేజీకి నామం పెట్టాం ముగ్గురం... పగలంతా మా తోనే గడిపాడు మనోహర్ కూడా... సాయంకాలం నేను, ప్రియాంకే మాత్రమే గుడికి వెళ్ళే ఏర్పాటు చేశాడు మనోహర్... బహుశా మాకు ఏకాంతం కల్పించడనికనుకుంటా..

ఆ రోజు తొలిసారి ప్రియాంకని నేను చూసిన డ్రెస్‌లో మరింత గ్రేస్‌ఫుల్‌గా కన్పించసాగింది నా కళ్ళకి ప్రియాంక... కొబ్బరికాయ చిప్పు పగులగొట్టి నాకో ముక్క ఇచ్చింది... కళ్ళకద్దుకుని నోట్లో వేసుకున్నాను నేను...

"రెండురెళ్ళు నాలుగు అంటాన్నేను. మీకేమైనా అభ్యంతరమా?" హఠాత్తుగా అడిగాన్నేను.

"లేదు... ఎందుకలా అడిగారు?" అంది ప్రియాంక.

"నాక్కూడా అభ్యంతరం లేదు... సరే... గల్ఫ్ యుద్ధం ఇంత త్వరగా ముగియడం మీకేమైనా ఇబ్బంది కలిగించిందా?"

పటిష్టమైన కట్టడాలకు
బిరకాల మన్నికకు
భీమ సిమెంట్

"నాకా... యుద్ధమా... ఏవిటి ఇవాళ విచిత్రమైన ప్రశ్నలేస్తున్నారు... యుద్ధం ఎప్పుడు ముగిస్తే నాకేంటి?" చిలిపిగా నవ్వింది ప్రియాంక.

"చూశారా? నాకూ అంతే... యుద్ధం ఎప్పుడు ముగిసినా నాకేం ఇబ్బంది లేదు... అన్నట్టు మీకు ఏ పూలంటే ఇష్టం?" మళ్ళీ అడిగాన్నేను.

"సన్నజాజులు... కనకాంబరాలు" ఆలోచించి చెప్పింది ఆసక్తిగా.

"చూశారా? నాకూ ఆ పూలంటేనే మోజు... అఫ్‌కోర్స్ పూలతో నేనేం చేసుకుంటాన్లెండి! ఇలా ఆలోచించుకుంటూ పోతే... మీ అభిరుచులూ, నా అభిరుచులూ బాగా కల్సిపోయినట్లన్పిస్తోంది. ఇక వెళ్దాం పదండి" అంటూ గుడిమెట్లు దిగడం ఆరంభించాన్నేను.

ఏడు మెట్లూ దిగింతర్వాత "చూశారా... మనం దైవ సన్నిధిలో ఏడు అడుగులుకల్సి నడిచాం... శాస్త్రోక్తంగా నాతో ఏడడుగులు నడవడానికి మీకేమైనా అభ్యంతరమా?" ఇందాకటిలాగే చిలిపిగా అడిగాన్నేను.

"నాకేం అభ్యంతరముంటుం..." అంటూ తక్కున ఆగి ఆశ్చర్యంగా నా వైపు చూసింది ప్రియాంక.

"అదేవిటండీ అలా అయిపోయారు... నేనేమైనా మిమ్మల్ని హర్ట్ చేశానా? ఎన్నాళ్ళగానో నా మనసులో వున్న మాటని ఇవాళ మీతో చెప్పగలిగాను... ఐ లవ్ యూ సో మచ్..." అంటూ ఏదో భావావేశంతో చెప్పబోయిన నా వైపు కళ్ళల్లో సన్నటి నీటి పొర కదలాడగా నిర్వేదంగా చూసింది ప్రియాంక.

"నా లోపం తెలిసీ మీరీ మాట అడుగుతున్నారా?"

"ఏవిటండీ మీ లోపం... అసలు ఎంతో జాగ్రత్తగా గమనిస్తే గానీ మీ లోపాన్ని గుర్తించలేరెవ్వరూ! ఎందుకలా పదే పదే లోపం... లోపం అనుకుని బాధపడతారు. మీ వ్యక్తిత్వం నాకు నచ్చింది. మీ మంచితనం నన్ను ముగ్ధుణ్ణి చేసింది... నా నిర్ణయం మీకు చెప్పాను. బాల్ ఈజ్ ఇన్ యువర్ కోర్ట్... మీ మూడ్ పాడు చేసి వుంటే సారీ..." చెప్పాన్నేను.

"నో... నో... అలాంటిదేం లేదు. నన్నుకాస్త ఆలోచించుకోనివ్వండి" అంది ప్రియాంక.

సంతోషంగా చూశాను ప్రియాంక వంక...

* * *

రాత్రి గం. 8-15 ని.లు

ప్రియాంకని హాస్టల్‌లో వదిలేసి వస్తుంటే దారిలో కనబడ్డాడు మనోహర్.

"రేయ్ ఆ చక్రవర్తిగాడు నిన్ను దెబ్బ తీయటానికి రంగం సిద్ధం చేస్తున్నాడని తెలిసింది... ఘనం కాస్త అప్రమత్తంగా వుండాలి. ఏ క్షణాన్నైనా నీ మీద..." వాడి మాట పూర్తి కాకముందే 'ధన్'మని పడింది ఐరన్ రాడ్ దెబ్బ నా తల మీద వెనక నుండి. చక్రవర్తి, వాడి గాంగ్ యమకింకరుల్లా కన్పించారు వెనుదిరిగిచూసిన నాకు. ప్రతిఘటించే లోపే నా వంటి మీద ట్యూబ్ లైట్లూ, సైకిల్ చైన్లూ, రాడ్సూ కరాళ నృత్యం చేశాయి... మనోహర్ రూపం నా కళ్ళ ముందు నుండి ఫేడౌట్ కాసాగింది... నెమ్మదిగా నా కళ్ళు మూతలు పడసాగేయి...

"ఎనిథింగ్ సీరియస్ డాక్టర్" ఆదుర్దాగా అడుగుతున్నాడు మనోహర్.

"నథింగ్ టు వర్రీ... పేషెంట్ తలకి బాగా గాయమైంది. కాస్త రెస్ట్ తీసుకుంటే సరిపోతుంది. ప్రియాంక అనే అమ్మాయిని అతను చూడాలని పదే పదే కోరుతున్నాడు. ఆ అమ్మాయివుందా ఇక్కడ?" ప్రశ్నిస్తున్నాడు డాక్టర్.

వాళ్ళ మాటలునాకు లీలగా వినబడుతున్నాయి.

కొద్ది క్షణాల తర్వాత ప్రియాంక నెమ్మదిగా నా దగ్గరకి వచ్చింది... "ఏమిటి సందీప్ ఇదంతా...? నా కోసం నువ్విలా..." మాటలు రాక కన్నీళ్ళు పొంగుతూంటే నా పక్కన కూచుంది నా చేతిని నిమురుతూ.

"ప్రియ నేస్తం కోసం ఈ మాత్రం బాధ భరించలేనా ప్రియాంకా"

"కానీ ఈ అవిటి దాని మీద మీ కెందుకింత ప్రేమ?"

"ఎవరన్నారు మీరు అవిటివారని? మీరు కాదు ఆ మాట అన్నవాళ్ళని పట్టి పీడిస్తోంది భయంకరమైన మానసిక అంగ వికలత్వం.. మీకు ఆత్మ విశ్వాసాన్ని అందించడం చేతకాక మాటల్తో చేతల్తో మిమ్మల్ని క్రుంగదీసే ఈ రాతిమనుషులకు మీ గురించి మాట్లాడే హక్కు లేదు. అందుకే నీకు జీవితాంతం తోడుగా నిలిచే భాగ్యాన్ని నేను కోరుకుంటున్నాను... ఎస్ ప్రియాంకా... ఇది సానుభూతీ కాదు... నీ మీద జాలి అంతకన్నా కాదు... రేపెవరైనా నిన్నునన్ను హేళన చేస్తే వాడి తల దించుకునేట్లు చేస్తానే తప్ప నే తలవంచుకోను... బిలీవ్ మీ ప్రియాంకా... ఐ లవ్ యూ... ఐ లవ్ యూ..." భావావేశం ముప్పిరిగొన్న నన్ను ఆశ్చర్యంగా, ఆనందంగా చూస్తూ ఆర్తిగా లతలా అల్లుకుపోయింది ప్రియాంక. "ఐ టూ లవ్ యూ..."అంటూ.

శతకోటి వాయిద్యాల్ని ఒకేసారి ట్యూన్‌చేసినట్లుంది నా మానసిక స్థితి... ఆ వెచ్చని కౌగిలిలో నా శారీరక బాధలన్నీ మటుమాయమయ్యాయనిపించింది.

చేతిలో సిరంజితో ఇంజెక్షన్ చేయడానికి వార్డ్‌లో అడుగెట్టిన యంగ్ నర్స్ తలుపునుదగ్గరగా లాగి నవ్వుకుంటూ వెళ్ళిపోవడం నా కంట పడక పోలేదు.

ఎక్కడో దూరంగా ఘంటసాల గాన తరంగాలు అలలుఅలలుగా వచ్చితాకుతున్నాయ్ నా కర్ణపుటాల్ని—

"నిన్ను నిన్నుగా ప్రేమించుటకు
నీ కోసమే కన్నీరు నించుటకు
నేనున్నానని నిండుగ పలికే తోడొక
రుండిన అదే భాగ్యము అదే స్వర్గమూ
మనసున మనసై బ్రతుకున బ్రతుకై
తోడొకరుండిన అదే భాగ్యమూ అదే
స్వర్గమూ" అంటూ...!

●

పటిష్టమైన కట్టడాలకు
దిరకాల మన్నికకు
భీమ సిమెంట్